క్లుప్తంగా

చెరువు శిఖం భూమి ఆక్రమణ!



మొగిలకుంట చెరువులో మట్టి పోసి చదును చేస్తున్న రైతులు

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెం గ్రామ పరిధిలోని మొగిలకుంట చెరువు శిఖం భూమిని పలువురు రైతులు కబ్జా చేశారు. మునగాల గ్రామానికి చెందిన పలువురు చెరువు భూమిలో శనివారం మట్టి పోసి ట్రాక్టర్లతో చదును చేసి ఆక్రమించారు. ఈవిషయమై పలువురు ఆచార్యులగూడెం గ్రామస్తులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

తవ్వకాల్లో బయటపడిన విగ్రహాల ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో గత ఏడాది నూతన నిర్మాణాల కోసం తవ్వుతుండగా బయటపడిన పలు పురాతన విగ్రహాలను శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తాత్కాలికంగా ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. తవ్వకాల్లో లభించిన లక్ష్మీనారాయణుడు, శ్రీకృష్ణుడు, లక్ష్మణుడు, అల్వార్‌లతో పాటు పలు విగ్రహాలను దాతల విరాళాలతో నిర్మించిన తాత్కాలిక షెడ్‌లో ఉంచినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తూముల వీరస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వినతి



పీఆర్ డీఈకి వినతిపత్రం అందజేస్తున్న మధుసూదన్, తదితరులు

కోదాడ : కోదాడ నుంచి వాయిలసింగారం వెళ్లే రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో 25 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే పనులు చేపట్టాలని ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ స్టేట్ కోఆర్డినేటర్ గుండా మధుసూదన్ కోరారు. ఈమేరకు శనివారం కోదాడలోని పంచాయతీరాజ్ డీఈ సతీష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డుపై గుంతల్లో కంకర పోయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్.రావు, శేకు రమేష్ పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి మైహోం పరిశ్రమ విరాళం



ఆలయ చైర్మన్‌కు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న మైహోం అధికారులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో రామాలయం నిర్మాణానికి మైహోం సిమెంట్స్ పరిశ్రమ తరఫున రూ.5 లక్షల విరాళాన్ని పరిశ్రమ యూనిట్ హెడ్ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఆలయ కమిటీ చైర్మన్ పేరం కొండల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద గత రెండు సంవత్సరాలుగా చౌటపల్లిలో వివిధ అభివృద్ధి పనులకు రూ.60 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం నాగేశ్వరరావు, ఏజీఎం శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకటరెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : అక్రమంగా ఇసుక తరలిస్తు న్న రెండు ట్రాక్టర్లను చింతలపాలెం పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలంలోని నక్కగూడెంకు చెందిన బాణావత్ నాగరాజు, చింత్రియాలకు చెందిన షేక్ ఖాసీంలు కృష్ణానది నుంచి అనుమతి లేకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీఐకి ఫిర్యాదు

హుజూర్‌నగర్ : నేరేడుచర్లలో ఓ ప్రైవేటు సంస్థ ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇస్తామని రూ.15 వేలు వసూలు చేసి మోసం చేసిందని గరిడేపల్లి మండలం పొనుగోడుకు చెందిన మల్లికంటి ఉపేందర్ శనివారం హుజూర్‌నగర్‌లో సీఐ చరమందరాజుకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి ఆ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.

ఊరూరా హనుమాన్ జయంతి వేడుకలు

కోదాడరూరల్ : మండల పరిధిలోని దోరకుంట, నల్లబండగూడెం, రెడ్లకుంట, తొగర్రాయి గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో నిర్వాహకులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో అమరనేని వెంకటేశ్వరరావు, సంధ్య, రామారావు, నర్సింహారావు, అప్పారావు, జగన్ పాల్గొన్నారు.

మునగాల : మండల వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ తూముల వీరస్వామి ఆధ్వర్యంలో హనుమాన్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం అఖండ దీపారాధన, స్వామివారికి అభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు బొర్రా కృష్ణమాచార్యులు, పురోహితులు వారణాసి వెంకటరమణశాస్త్రి, వారణాసి బుచ్చిరామయ్యశాస్త్రి, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

ముకుందాపురంలో అన్నదానం..

మండలంలోని ముకుందాపురంలో శనివారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలక విక్రమ్‌రెడ్డి, బోళ్ల కృష్ణారెడ్డి, సైదిరెడ్డి, రాజీవ్‌రెడ్డి, పందిరి నాగిరెడ్డి, వెలిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురం, బూరుగడ్డలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలపురంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చలు నిర్వహించారు. అనంతరం సువర్చలాదేవి సమేత ఆంజనేయస్వామి శాంతి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామివార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రక్తికట్టించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ వెంకటచలపతి, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని గోవిందపురంలో గల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎస్ఐ ముత్తయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయల కమిటీ సభ్యులు కె.వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్‌రెడ్డి, కోలా నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, జి.వీరబాబు, బి.శ్రీనివాస్, జె.పిచ్చయ్య, ఎస్.ఆదినారాయణ, జి.వెంకట్‌రెడ్డి, పి.అంజిరెడ్డి, డి.రవీందర్ రెడ్డి, పి.ధనుంజయ్, రాజు, జ్ఞానయ్య, జె.సాంబయ్య, ఎం.రామ్ గోపి, తన్నీరు మల్లికార్జునరావు, భక్తులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో..

పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, సింధూరం, 18 తమలపాకులతో సహస్ర నామార్చన జరిపించారు. సాయంత్రం ఆంజనేయస్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈఓ గుజ్జుల కొండారెడ్డి, స్థానాచార్యులు రామకృష్ణమాచార్యులు, అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, జగన్నాథచార్యులు, ఎంవీఎన్ ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల వ్యాప్తంగా గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు, బేతవోలు తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు.

నేరేడుచర్ల : మండలంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేరేడుచర్ల పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో కొలువైన ఆంజనేయస్వామికి భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. పాత నేరేడుచర్ల, నర్సయ్యగూడెం గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

మేళ్లచెరువు : మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు . అభిషేక పూజ, సహస్రనామార్చన, ఆకుపూజ, అష్టోత్తరం, ఆరగింపు, హారతి, మంత్రపుష్ప తీర్థ ప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మఠంపల్లి : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మట్టపల్లి క్షేత్రంలో గల శ్రీఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ్య అర్చకులు సీహెచ్.పద్మనాభాచార్యులు శ్రీస్వామివారికి నాగవల్లీ దళాలతో ప్రత్యేకార్చనలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా మఠంపల్లి, రఘునాథపాలెం, చౌటపల్లి, అల్లీపురం, పెదవీడు, బక్కమంతులగూడెంతో పాటు వివిధ గిరిజన తండాల్లో గల శ్రీఆంజనేయ దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో భక్తులకు అన్నదానం చేశారు.

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు గడ్డిపల్లి తదితర గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో యువతులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. గరిడేపల్లిలో మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు సుదర్శన శ్రీనివాసాచార్యులు, రాజన్ ఆచార్యులు, ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్, మాజీ సర్పంచ్‌లు త్రిపురం అంజన్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బండా నర్సిరెడ్డి, గెల్లి సతీష్‌కుమార్, పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు బృందావనపురం, వల్లాపురం, రత్నవరం, తెల్లబల్లి, రామాపురం, కాగితరామచంద్రాపురం తదితర గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బృందావనపురంలో భక్తులకు అన్నదానం చేశారు.

పాలకవీడు : మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బెట్టెంతండాలోని ఆంజనేయస్వామి ఆలయంలో జెడ్పీటీసీ మాళోతు బుజ్జీమోతీలాల్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాళోతు మోతీలాల్, బండావత్ సోమ్లానాయక్, వెంకన్న దంపతుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.



నేరేడుచర్లలో పూజలు చేస్తున్న భక్తులు



మునగాల : శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయంలో..



హుజూర్‌నగర్ : వేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో..



గరిడేపల్లిలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



మునగాల : ముకుందాపురంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



పాలకవీడు : బెట్టెతండాలో పూజల్లో పాల్గొన్న జెడ్పీటీసీ బుజ్జీమోతీలాల్, భక్తులు



కోదాడరూరల్ : స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న వెంకటేశ్వరరావు -సంధ్య దంపతులు



హుజూర్‌నగర్: అభయాంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు



హుజూర్‌నగర్‌రూరల్ : గోపాలపురంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



మఠంపల్లి : మట్టపల్లి ఆలయంలో..



మేళ్లచెరువులో..



నడిగూడెం : బృందావనపురంలో..



చిలుకూరులో..

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



రామాపురంలో మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈఈ వెంకటయ్య

నడిగూడెం : అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ ఈఈ వి.వెంకటయ్య అధికారులను ఆదేశించారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని తెల్లబల్లి, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండా, రామాపురం, చాకిరాల, శ్రీరంగాపురం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న మరుగుదొడ్లు, మూత్రశాల, తాగు నీటి వసతి, విద్యుత్ సరఫరా పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఈ హర్ష, ఏఈ రంగారావు తదితరులు ఉన్నారు.

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా



కొండాపురంలో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

చిలుకూరు : మండలంలోని కొండాపురం గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ శనివారం మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామస్తులు నీటి కోసం అల్లాడిపోయారు. గ్రామ పంచాయతీ అధికారులు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయడంతో నీటి కోసం మహిళలు ఎగబడ్డారు. ఎట్టకేలకు మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి చేయడంతో తిరిగి నల్లాల ద్వారా నీరు పట్టుకున్నారు. కాగా, గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్నదని, నీటి సమస్య పరిష్కారానికి కేటాయించిన నిధులతో తక్షణమే పైపులైన్లు ఏర్పాటు చేసి సమస్యను లేకుండా చూడాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు

విత్తనశుద్ధి కేంద్రాల తనిఖీ



విత్తనశుద్ధి కేంద్రంలో విత్తనాలను తనిఖీ చేస్తున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు

గరిడేపల్లి : మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామంలో గల విత్తనశుద్ధి కేంద్రాలను శనివారం స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, మండల వ్యవసాయ అధికారి ప్రియతమ్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ విత్తన నమూనాలను సేకరించి హైదరాబాద్‌లోని విత్తన పరీక్ష కేంద్రాలకు పంపినట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుమతి పొందిన వారి దగ్గర నుంచే విత్తనాలు తీసుకువస్తున్నారా లేదా అనే విషయంపై విచారణ చేసినట్లు తెలిపారు.

పోరాట యోధుడు మండవ మైసయ్య



మైసయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

గరిడేపల్లి : నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రజా సమస్యలపై పోరాడిన యోధుడు మండవ మైసయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. గరిడేపల్లి మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో శనివారం అనారోగ్యంతో మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు మండవ మైసయ్య మృతదేహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీపీఎం విస్తరణలో మైసయ్య పాత్ర మరువలేనిదన్నారు. అందే నర్సయ్య, సుందరి బసవయ్యలు చేపట్టిన ఎర్రజెండా బాటలో నడుస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించారని తెలిపారు. మైసయ్య ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్, నందిపాటి మట్టయ్య, మండల నాయకులు తుమ్మల సైదయ్య, దోసపాటి భిక్షం, బొల్లెపల్లి శ్రీనివాస్, చామకూరి వెంకటప్పయ్య, మండవ వెంకటేశ్వర్లు, సైదులు, తిరపయ్య, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం



చెన్నాయిపాలెంలో ఏపుగా పెరుగుతున్న మొక్కలు



సుల్తాన్‌పూర్‌తండాలో..



లాలితండాలో..



తుమ్మలతండాలో..

మఠంపల్లి : నర్సరీల్లో పదవ విడత హరితహారానికి మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలోని 42 ఆవాస గ్రామాల్లో నర్సరీల్లో మొక్కలను ఏపుగా పెంచుతున్నారు. ఒక్కో నర్సరీలో 6 వేలు మొక్కలను పెంచుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో మాత్రం 20 వేల మొక్కలను పెంచుతున్నారు. నర్సరీల్లో సుమారు 3 లక్షల వరకు పలు రకాల పండ్లు, పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు ఉన్నాయి. అందులో సీతాఫలం, మామిడి, జామ, ఉసిరి, దానిమ్మ, చింతతో పాటు అల్లనేరేడు, కానుగ, బాదం, గులాబీ, మందారం తదితర మొక్కలు ఉన్నాయి. వర్షాలు కురవడమే ఆలస్యం జూన్, జూలై మాసాల్లో హరితహారంలో భాగంగా రహదారులు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు అధికారులు, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



కోదాడలో మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి

నేరేడుచర్ల : ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శనివారం నేరేడుచర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఇంగ్లిష్ మీడియం విద్య బోధనను ప్రభుత్వం ప్రకటనల రూపంలో ప్రజలకు తెలియజేయాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలల ప్రారంభానికి ముందే ఉపాధ్యాయులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ఎమ్మెల్యేలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.మంగ, జిల్లా అధ్యక్షుడు ఆర్.ధనమూర్తి, హుజూర్‌నగర ప్రాంతీయ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శులు సుంకర క్రాంతికుమార్, డి.పద్మావతి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, యూటీఎఫ్ నాయకులు సైదిరెడ్డి, నరసింహారావు, రాంబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదే : నర్సిరెడ్డి

కోదాడ రూరల్ : ప్రభుత్వ విద్యాసంస్థలు మూతబడటానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని, ప్రభుత్వ పాఠశాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదేనని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆవరణలో తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో 'ప్రభుత్వ బడులు నిలబడాలి.. చదువులో అంతరాలు పోవాలి'అనే అంశంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ఆర్థిక అసమానతలు పోవాలంటే ప్రభుత్వ బడులు నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యారంగంపై తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ఉపాధ్యాయులకు ఉందన్నారు. ఒక్క భారతదేశం తప్ప ప్రపంచంలో విద్యను ఏ దేశం వ్యాపారమయం చేయలేదని వాపోయారు. గత పదేళ్లలో ప్రభుత్వ వైఫల్యంతో ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలోకి నెట్టివేయబడిందని ఆరోపించారు. గత మూడేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో స్కావెంజర్లను నియామించకపోవడం అత్యంత దారుణమన్నారు. పాఠశాలలో స్కావెంజర్లు లేకపోవడంతో ఉపాధ్యాయులే పాఠశాలలను శుభ్రం చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్కావెంజర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేఏ.మంగా, జిల్లా అధ్యక్షుడు ఆర్.ధనమూర్తి, కోదాడ ప్రాంతీయ అధ్యక్షుడు వెంకటరమణ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, టీపీఆర్‌పీఏ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం వెంకటరెడ్డి, యూటీఎఫ్ బాధ్యులు పాల్గొన్నారు.

విత్తనాల దుకాణాల్లో అధికారుల తనిఖీలు



నడిగూడెంలోని విత్తనాల దుకాణంలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్సు బృందం

నడిగూడెం : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి, నడిగూడెం మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ హెచ్చరించారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను ప్రత్యేక టాస్క్‌ఫోర్సు బృందంతో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి మాట్లాడారు. జిల్లాకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, విత్తనాలు విక్రయించేటప్పుడు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ హేమామాలిని, ఇన్‌చార్జి ఏడీఏ ఎం.రాజగోపాలరావు, ఎస్ఐ జి.అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విత్తనాల డీలర్లకు అవగాహన

పాలకవీడు : నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై లక్ష్మీనర్సయ్య, వ్యవసాయాధికారి శ్రీనివాస్ డీలర్లను హెచ్చరించారు. శనివారం పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం రైతు వేదికలో ఎరువులు, విత్తన డీలర్లకు నిర్వహించాన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వానాకాలం సీజన్ సమీపిస్తుండడంతో రైతులకు నాణ్యమైన పత్తి, వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. డీలర్లు స్టాక్ రిజిస్టరును తప్పక నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రీకాంత్, శారద, వెంకటేష్, ఆర్ఐ నర్సయ్య, విత్తన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో..

మఠంపల్లి : మండల కేంద్రంలోని పాన్‌షాపుల్లో స్థానిక పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. జాన్‌పాడు రోడ్డులో గల బిస్మిల్లా పాన్‌షాపులో అక్రమంగా విక్రయిస్తున్న పొగాకు ఉత్పత్తులను పట్టుకుని షాపు యజమాని షేక్ సుభానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. అదేవిధంగా మండల వ్యవసాయ విస్తరణాధికారి భవన్‌తో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.